# అదనులో మెదడుకు పదును

ఉదయం ఇంట్లో అందరూ హడావుడిగా మాటాడుకునే మాటలకి మెలుకువవచ్చింది నాకు. యేంజరిగివుంటుందీ - అనుకుంటూ బద్ధకంగా ఒళ్ళు విరుచుకుని లేచి గదినుంచి బయటకు వచ్చాను. నన్నుచూస్తూనే లావణ్య, "విన్నావా అన్నయ్యా-మనకి రెండిళ్ళవతల ఉన్నారే,అప్పారావు గారు వాళ్ళింట్లో దొంగలుపడ్డారు'' అన్నది నాందిగా.

'దొంగలు పడ్డారా? యేమేం పోయినై? అసలు లోపలికి ఎట్లా వచ్చారు?' అని ప్రశ్నించాను ఆత్రంగా. 'ఆడవాళ్ళ సొమ్ములన్నీ లాక్కున్నారట. వచ్చిన దొంగలకు తెలుగురాదటన్నయ్యా హిందీలో మాట్లాడారట. తలుపుతట్టి లోపలికి జొరబడి తుపాకితో బెదిరంచి సొమ్ములు లాక్కుని పారిపోయారట. పాపం అప్పారావుగారు దొంగలు పారిపోయేటప్పుడు "దొంగ- దొంగ,- అని అరవబోతే కోపంతో చేతిలోని కట్టెతో తలమీద కొట్టారట. ఆయనకు బాగా దెబ్బ తగిలింది.

ఈ దొంగతనం ప్రజలందరిలో భయాన్ని,'ఆలజడినీ సృష్టించింది. ఈ దొంగలెవరో వేరే ప్రాంతం నుంచి వచ్చారని పట్టణంలోని అన్ని ఇళ్ళు దోచుకుంటారనీ పుకార్లు నిజమేనని రుజువు చేస్తూ పట్టణంలోని పలు వీధుల్లో ఇట్లాంటివే ఐదారు దొంగతనాలు జరిగినై.

జనంలో భయం పెరిగిపోయింది. ఎవరికీ రాత్రుళ్ళు సరిగ్గా నిద్ర పట్టటం లేదు. యే క్షణంలో దొంగలొచ్చి తలుపు కొడతారో అని అందరికీ గుండెల్లో దడ, పోలీసులు తీసుకున్న చర్యలతో పాటు ఎవరి వీధిలో వారు వంతులవారీగా గస్తీతిరిగే కార్యక్రమం ఒకవారం రోజుల పాటు కొనసాగింది. తరువాత క్రమంగా యే కారణం వల్లనైతేనేమి అల జడి సద్దుమణిగింది.

కానీ మావీధిలో మాత్రం అదింకా రాజుకుంటూనే ఉంది. 'ఆ దొంగ లింకా పట్టణంలోనే ఉన్నారు. అందరూ కాస్త ఆ దొంగల విషయం మర్చి పోగానే మళ్ళీ ప్రారంభిస్తారు' అనుకుంటున్నారందరూ.

మావీధిలో సంవత్సరం క్రిందట చిన్న హోటల్ ఒకటి వెలిసింది. తడికలదే అనుకోండి చిన్న హోటలని చిన్న చూపుతో సాధారణంగా అం దులోకి ఎవరూవెళ్ళరు, అలగాజనం తప్ప.

రాత్రి ఎనిమిది గంటల వరకూ అక్కడా ఇక్కడా తిరిగి నేను నా స్నేహితులు ముగ్గురితోనూ ఇంటివైపు వెళ్ళబోతుంటే ఆ చిన్న హోటల్ ఓనర్ మల్లేశు 'సార్ సార్' అని పిల్చాడు. నలుగురం ఆగి అతనివైపు ప్రశ్నార్థకంగా చూశాము. "మన వీధిలో ఎవరింటికో దొంగలు వచ్చి దోచుకుంటామని ఫోన్ చేశారట సార్-మీకు తెలుసా?" అన్నాడు. అతని మొహంలో భయం స్పష్టంగా కనిపిస్తున్నది.

మేం నలుగురం ఒకరి మొహాలొకరం చూసుకున్నా "నీతోఎవరు చెప్పారీ విషయం?" అన్నాను నేను. 'ఇంతకు ముందే కాఫీ తాగడానికి వచ్చిన వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటుంటే విని అడిగాను సార్, వాళ్ళు

చెప్పారు." అన్నాడు మల్లేశు ఒక్క నిమిషం అందరం మౌనంగాఉండిపో యాం. మేమెవ్వరం మాట్లాడక పోయేసరికి మళ్ళీ మల్లేశుఅన్నాడు. 'సార్ ఈ దొంగలను పట్టుకోవాలంటే మళ్ళీ అందరం రాత్రిళ్ళు జట్లవారీగా గస్తీ తిరగాలి."

"అవును దొంగతనాలు ఆగిపోయినయ్యని మనం అనుకుంటున్నాం గానీ- ఈ పరిస్థితి అంతనమ్మదగిందిగాలేదు, కాపలా తిరగడం తప్పదు" ప్రశాంత్ తన అభిప్రాయం చెప్పాడు.

"ఇక్కడ ఇట్లానుంచుని ఎంతసేపుమాట్లాడుకుంటాం? హోటల్‌లో కూర్చుందాం పదండి", రవి హోటల్లోపలకి దారితీశాడు. మేమూ వాణ్ని అనుసరించాము. మల్లేశు మొహం వికసించింది. 'రండి సార్ రండి' అని అహ్వానించాడు. మర్యాదపూర్వకంగా హోటల్లో కూర్చుని టిఫిన్, కాఫీలు సేవిస్తూ తర్జన భర్జనలలో పడ్డాం. మమ్మల్ని చూసి ఇంకో పదిమందిదాకా లోపలికొచ్చారు. మొత్తానికి అందరం కలసి జట్లు జట్లుగా గస్తీ తిరగాలన్న నిర్ణయం ఖాయమైపోయింది. నాకు ఈహోటలుంది కదాసార్, మనగండం గడిచేవరకూ రాత్రిళ్ళు ఇది తెరచి నేనూ ఇక్కడే వుంటాను" అన్నాడు. మల్లేశు తానూ ఉడతా భక్తితో ఏదో సహాయం చేస్తానన్నట్లు.

అనుకున్నట్లుగానే జట్లుజట్లుగా గస్తీతిరగడం జరుగుతోంది. అంద రం కలుసుకోవడానికి మాట్లాడుకోవడానికి ఈహుటల్ కేంద్రమైపోయింది. మల్లేశు హడావిడి ఎక్కువైపోయింది. ఇప్పుడతను అందరికి టిఫీనూ,కాఫీలు అందించలేక సతమతమవుతున్నాడు. మూడు రోజుల కష్టపడి వం తులవారీగా కాపలా కాయడమేగానీ మా వీధిలో దొంగతనమేమీ జరగలేదు. పట్టణం మారుమూలల్లో మాత్రం చెదురుమదురుగా దొంగతనం వార్త లందుతున్నై.

ఆరోజు రాత్రిళ్ళు గస్తీతిరగడం గురించి చాలామంది విసుగుదలను వ్యక్తం చేశారు. ఇప్పుడు కాస్త ప్రశాంతంగానే ఉంది కాబట్టి ఈ కార్య క్రమాన్ని ప్రస్తుతానికి నిలుపుచేద్దాం అనే అభిప్రాయానికి వచ్చారు. మరునాడు సాయంత్రం ఆ హోటల్లో అనుకోకుండా ఒక అత్యవసర సమా వేశం జరిగింది. మా వీధిలో ఉండే పరమేశ్వరావు మొహం కత్తివాటుకు నెత్తురుచుక్క లేకుండా పాలిపోగా "ఎవరో ఈ ఉత్తరం మా ఇంట్లో పడే శారు"-అంటూ తనచేతిలోని కాగితాన్ని అందరికీ చూపిస్తున్నాడతను. నేను తీసుకుని చూశాను. ఒక చిన్న తెల్లకాగితం ముక్కమీద 'రెండురోజుల్లో మీ ఇంట్లో దొంగతనం చెయ్యబోతున్నాము' అని మాత్రం ఉంది.

'ఎట్లా?- ఏంచెయ్యాలి?' అంటూ తెగకంగారు పడిపోతున్నారు పర మేశ్వరావుగారు 'పోలీసులకు తెలియజేద్దాం' అన్నాను నేను. రాత్రి తొమ్మిది గంటల వరకూ ఈ విషయాన్నే చర్చిస్తూ గడిపేశాము. మల్లేశు గిరాకీ ఈ పదిరోజుల్లో బాగా పెరిగింది. ఇదివరకు వెలవెలబోయే హోట లిప్పుడు కళకళలాడుతున్నది.

అనుకున్న ప్రకారం రెండు రోజులూ జాగ్రత్తగా వీధిలో కాపలా కాశాము. కానీ దొంగఅన్నవాడి జాడఎక్కడా కనిపించలేదు. గస్తీకి భయ పడి దొంగలు రాలేదా? ఏమో? ఎటూ తెలియక అందరూ సతమతమవు తున్నారు. మధ్యలో మరో నాలుగు రోజులు ఇంట్లో సుఖంగా నిద్ర పోయినాము.

కానీ దొంగల గొడవ పూర్తిగా సద్దుమణగలేదు. అప్పుడప్పుడూ నేనున్నానంటూ తలఎత్తుతూనే ఉంది, కానీ జనం చాలావరకు విసుగెత్తి పోయినారు.

o o o o

ఒక రోజు రాత్రి నిద్రపట్టక లేచి వాకిలితలుపులు తీసుకుని బయటకు వచ్చాను. ప్రశాంతమైన నిశ్శబ్ద వాతావరణంలో కాలంగడపడం నాకలవాటు. సమయం రాత్రిపన్నెండు గంటలైఉంటుంది, అందరూ మంచి

నిద్రలో ఉన్నారు. ఇంటిముందర ఉన్న నన్నజాజి తీగ ప్రక్కన నుంచుని ఆకాశంలోకి చూస్తూ ఆలోచిస్తున్నాను. చీకటిరోజులు, పరీక్షగా చూస్తే గాని నేనక్కడ నుంచున్నట్లు ఎవరూ గుర్తించలేరు. వాకిలి తలుపులు దగ్గరకు వేశాను.

ఇంతలో మెల్లగా గేటు చప్పుడైంది. ఈ సమయంలో వచ్చేదెవరో నాకు అర్థంకాలేదు. గేటు తీసుకుని ఓ పదేళ్ళకుర్రాడు మెల్లిగా లోపలికి వస్తున్నాడు. ఆఁ ఈ అబ్బాయి మల్లేశు హోటల్లో పనిచేస్తాడు. 'ఇక్కడికి ఎందుకొస్తున్నట్లు? ఏం చేస్తాడు?' అని ఆలోచిస్తూ మరికాస్త చీకట్లోకి ఒంగి నుంచున్నాను. ఆ పిల్లవాడు దొంగలాగా అటూఇటూ చూసి వాకిలి దగ్గరి కిటికీలోనుంచి తన చేతిలోని కాగితం లోపలికి విసిరేశాడు. చీకటిలో అతడునన్ను చూడనేలేదు. గబగబా గేటు వైపు వెళ్ళబోతుంటే ఆపిల్లవాడి చెయ్యి గట్టిగా పట్టుకున్నాను. అతడు విడిపించుకుని పారిపోబోయినాడు. కాని నేను పట్టువదల్లేదు. లోపలికి లాక్కొచ్చాను. ఈ గలాటాకి ఇంటిలో అంతా మేల్కొన్నారు ఏం జరిగిందంటూ.

ఆ పిల్లవాడు భయపడుతూ తలవంచుకున్నాడు. "చెల్లాయ్, ఆ కాగితం ఇటుతేమ్మా" అన్నాను ఆ కుర్రాడు లోపలికి వేసిన కాగితాన్ని చూపిస్తూ. లావణ్యతెచ్చిచ్చింది. పరమేశ్వరరావు వాళ్ళింట్లొ దొంగలుపడే సిన కాగితంలో ఏమివ్రాసివుందో ఇందులోనూ అదే దస్తూరీతో అదే విషయం వ్రాసిఉన్నది.

దొంగతనాలు సద్దుమణిగినా- వాటి ఆధారంగా తన హోటల్‌గిరాకీ, పెరగడం కోసం మల్లేశు ఇన్నాళ్ళు ఆడిన నాటకం మంచులాగా విడిపోతుంటే ఆ కుర్రాణ్ణి ఏమనాలో తెలియక అలాగే చూస్తుండిపోయాను.

(ఆంధ్రభూమి దినపత్రిక, 4-11-'79)